# సింగిల్‌పేజి కథలు

## ప్రేమకు స్వాగతం

ఆశల పూలన్నీ నిర్లిప్తతో నేల రాలిపోతున్న వేళ. ఊహల హర్మ్యాలు పేక మేడలై కూలిపోతున్న వేళ. అడుగడుగునా స్తబ్దత. అంతులేని నిరాసక్తత. ఆకుపచ్చని కొండలు, కోనలు, లోయలు, స్వర ఝరీ తరంగాల సంగీతం, హృదయాలను కదిలించే సాహిత్యం... ఇవన్నీ చుట్టూ వున్నాయి. కానీ ఇవేవీ నాకు ఆనందాన్నివ్వడం లేదు. ఇంత అద్భుతమైన ప్రకృతిని ఆస్వాదించలేకపోతున్నాను, ఎందుకని?

మూసిన కనురెప్పల మాటున ఆమె జ్ఞాపకాలు పరదాల్లా కదులుతున్నాయి. కనురెప్పల్ని మెల్లగా తెరిచి బయటకు చూశాను.

ఏదో చిన్న స్టేషన్ ముందు ఆగింది రైలు. ప్రయాణీకులు నెట్టుకుంటూ, తోసుకుంటూ లోపలికి వస్తున్నారు.

ఎన్నో విరహపు మజిలీలు, మరెన్నో నిట్టూర్పుల మైలురాళ్లు. మనసు అట్టడుగు పొరల్లో నిక్షిప్తమైన జ్ఞాపకాల పుటలు. తిరగేస్తే ఓ అందమైన జ్ఞాపకం, మనసు నిండా హిమశకలంలా పరుచుకున్న ఒక అపురూపమైన అనుభూతి. ఆ అనుభూతి పేరే ఆశ్రిత! నా క్లోజ్‌ఫ్రెండ్ వేణూ వాళ్ల బాబాయి కూతురు ఆశ్రిత. దాదాపుగా ప్రతిరోజూ వేణు, నేను కలుసుకునేవాళ్లం. వేణు వాళ్లింట్లో ఆశ్రితను చూసిన క్షణం నేనెప్పటికీ మరచిపోలేను. బెదిరే నయనాలు, అదిరే అధరాలు, అమాయకత్వం, ముగ్ధత్వం మూర్తీభవించిన అందాల బాల ఆమె.


వేణు లేని సమయంలో నేనెప్పుడైనా వాళ్లింటికి వెళితే అతనొచ్చేదాకా పేపరు చదువుకుంటూ సోఫాలో కూర్చుని వుండేవాడిని. ఆ సమయంలో ఆమె నాతో ఏదో ఒకటి మాట్లాడటానికి ప్రయత్నించేది. నన్ను చూడగానే ఆమె కళ్లు మెరిసేవి. కాఫీ ఇచ్చేటప్పుడు చేయి కంపించేది. ఆమెలోని ఉద్వేగాన్ని, మూగప్రేమని గుర్తించీ మౌనంగా వూరుకునేవాణ్ణి.

అప్పట్లో స్టేట్స్‌కి వెళ్లి చదవాలనే అభిలాష నాకుండేది. బాగా చదువుకోవాలనీ గొప్ప పేరు సంపాదించుకోవాలనీ ఉన్న నాకు, ఆమె ప్రేమ తెలియలేదు. నాకోసం ఆమె పడుతున్న తాపత్రయం గమనించీ గమనించనట్టు వుండేవాణ్ణి. అప్పటి నా మూర్ఖత్వాన్ని తలచుకొని ఇప్పుడు ఎంత ఆవేదన చెందుతున్నానో నాకు మాత్రమే తెలుసు. ఆమె ప్రేమని పొందలేని నిర్భాగ్యుణ్ణి అయిపోయాను.

ఎంతోమంది తళుకులీనే తారల్లాంటి అమ్మాయిలు నా చుట్టూ తిరిగినా నాకెటువంటి ఆకర్షణా కలగదేం. ఏ అమ్మాయిని చూసినా నా హృదయం స్పందించదేం. నన్ను ప్రేమతో ఆర్తితో పెనవేసుకుపోగల స్త్రీమూర్తి ఆశ్రిత మాత్రమేనా?

నేను ఆశ్రిత గురించి, ప్రేమ గురించి ఆలోచించడం మొదలుపెట్టి, ఆమె ప్రేమని అందుకోలేని వేదన నా మనసంతా దావానలంలా వ్యాపించాక వేణు ద్వారా అప్పుడు తెలిసింది, ఆశ్రితకు నాలుగేళ్ల క్రితమే పెళ్లయిపోయిందని!

'ఇప్పుడు 'ఆశ్రిత నాకు పరాయిదా? కాదు కాదు, ఆమె నాకు పరాయిది కాదు' అంటూ గొంతెత్తి ఘోషిస్తోంది నా హృదయం. ఆత్మీయతతో ఆమెని చూడాలని ఆక్రోసిస్తోంది మనసు. అందుకే ఇప్పుడిలా ఈ ప్రయాణం.



ఏదో చిన్న స్టేషన్‌లో ఆగింది రైలు. నా ఆలోచనలకి అంతరాయం కలిగింది. అబ్బా! విజయవాడ రావడానికి ఇంకా ఎంతసేపు పడుతుందో... అసహనంగా రిస్ట్‌వాచ్‌కేసి చూసుకున్నా. మరొక పదిహేను నిముషాల్లో చేరుకుంటాననేసరికి ఏదో తెలియని గొప్ప రిలీఫ్ కలిగింది.

స్టేషన్‌లో దిగి, ఆటో ఎక్కాను. రివ్వుమంటూ దూసుకుపోయే ఆటోలోంచి జివ్వుమనే చల్లగాలి శరీరాన్ని హాయిగా స్పృశిస్తోంది.

విజయవాడ నగర వీధులన్నీ జనసందోహంతో కిటకిటలాడుతున్నాయి. అవన్నీ చిన్నప్పుడు నేను సంచరించిన వీధులే. ఆత్మీయతానుబంధాలను పంచుకుని, తియ్యటి జ్ఞాపకాలను మిగుల్చుకున్న ప్రదేశాలే. మనసు లోతుల్లో వున్న అనుభూతుల దొంతరలు ఉవ్వెత్తున ఎగసి రాగా, నా కళ్లలో సన్నటి నీటిపొర నిలిచింది.

సత్యనారాయణపురంలో అడుగుపెట్టాను. ఎక్కడా ఖాళీ ప్రదేశమన్నది కనబడటం లేదు. ఎటుచూసినా అపార్ట్‌మెంట్లే. వేణు వాళ్ల బాబాయి ఇల్లు మాత్రం అలాగే వుంది, కాకపోతే బాగా పాతబడిపోయింది. అక్కడక్కడ పెచ్చులూడిపోయి వెల్ల వెలిసిపోయిన గోడలు, పదేళ్ల క్రితం స్మృతుల్ని పదిలంగా దాచుకున్న పెద్దమనుషుల్లా వున్నాయి. ఇల్లు సులభంగానే గుర్తుపట్టి లోపలికి ప్రవేశించాను. వేణు వాళ్ల బాబాయి రామనాథంగారు వరండాలో కూర్చుని ఏదో పుస్తక పఠనంలో లీనమయి వున్నారు. కళ్లజోడు సవరించుకుంటూ, వచ్చిందెవరా అని నావైపు చూసి క్షణకాలం గుర్తురానట్టుగా వుండిపోయారు.

"నేనంకుల్, వేణు ఫ్రెండ్ శ్రేయాస్‌ని" వినయపూర్వకంగా నమస్కారం చేశాను.

"బాబూ నువ్వా! బాగున్నావా? అమ్మా నాన్నా ఎలా వున్నారు? స్టేట్స్‌కి వెళ్లి బాగా చదువుకున్నావని, మంచి హోదాలో వున్నావని వేణు చెప్పాడు. ఏం నాయనా, మమ్మల్ని గుర్తుపెట్టుకుని ఇంత దూరం చూడాలని వచ్చావా? చాలా సంతోషం!" అంటూ ఎంతో అభిమానంగా మాట్లాడారు. ఆయన గొంతులో ఏళ్లక్రితం నాటి అదే ఆప్యాయత, అదే ఆదరణ.

"అమ్మా ఆశ్రితా, మంచినీళ్లు పట్టుకురా" అంటూ కూతుర్ని కేకేశారాయన. ఆశ్రిత గురించి వివరాలు తెలుసుకుందామని వచ్చాడుగాని ఆమె ఇక్కడే వుందని తెలిసేసరికి గుండె వేగం హెచ్చింది నాకు.

ఆశ్రిత మంచినీళ్ల గ్లాసుతో హాల్లోకి వచ్చింది. బెదిరే కళ్లు, అదిరే పెదవులు, చిలిపి చూపులు, బుగ్గల్లో కెంపులు... ఏవీ లేవు ఆమెలో!

దైన్యాన్ని దాచుకున్న కళ్లక్రింద నల్లటి చారలు. నిర్లిప్తతతో కళ తగ్గిన మోము. నిండుగోదారి లాంటి గంభీరత.

"ఆశ్రితా! ఎవరొచ్చారో చూడు..." తండ్రి మాటలకు తల ఎత్తి చూసింది. ఆ కళ్లలో సంభ్రమాశ్చర్యాలు... పోగొట్టుకున్న అపురూపమైన పెన్నిధి ఏదో దొరికినట్టు, ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న వసంతం గుమ్మంలోకి వచ్చి నిలిచినట్టు ఆమె మోములో శతకోటి శరచ్చంద్రికలు...

"అందరు ఆడపిల్లల తండ్రులలాగే ఎంతో ఆశతో పిల్లకు పెళ్లి చేసి పంపాను. మంచి సంబంధం అనుకుని ఇచ్చి చేస్తే ఆ తర్వాత తెలిసింది, అతనికి లేని అవలక్షణాలు లేవని, తల్లీకొడుకులు ఒకటై అమ్మాయిని మానసికంగా, శారీరకంగా హింసించేవారని. తాగుబోతు, తిరుగుబోతు అయిన భర్తతో, గయ్యాళి అత్తగారితో ఆశ్రిత నరకాన్ని చవిచూసిందా ఇంట్లో. పిల్ల పండంటి కాపురం చూసి సంతోషపడదామని వెళ్లిన నేను, పిచ్చితల్లి మెడమీద, నడుంమీద తేలిన ఎర్రటి వాతలు చూసి నిర్ఘాంతపోయాను. అల్లారుముద్దుగా పెంచుకున్న పిల్లని,

చూస్తూ చూస్తూ ఆ రాక్షసులకు బలి ఇవ్వలేక తీసుకొచ్చే శాను. ఆశ్రిత ప్రస్తుతం ఇక్కడికి దగ్గర్లో వున్న ఓ స్కూల్లో టీచరుగా పనిచేస్తోంది. దేవుడు తనకు చేసిన అన్యాయాన్ని చిన్నపిల్లల మధ్య కొంతవరకూ మర్చిపోగలుగుతోంది"

"దేవుడు ఆశ్రితకు అన్యాయం చేయలేదు అంకుల్, న్యాయమే చేశాడు!" నా కళ్లలోంచి రెండు కన్నీటిబొట్లు బయటకు రాబోయి, లోపలే ఆగిపోయాయి.

"అంకుల్... ఆశ్రితను నేను పెళ్లి చేసుకుంటాను. మీకు అభ్యంతరం లేకపోతే వెంటనే ఏర్పాట్లు చెయ్యండి!" స్థిరంగా చెప్పాను నేను.

'ఏంటి బాబూ నువ్వు చెప్పేది?" ఆయన గొంతులో ఆశ్చర్యానందాలు.

"నిజమే అంకుల్... ఆశ్రిత అంటే నాకు చాలా ఇష్టం. తను కూడ నన్నెంతగానో ఆరాధించింది. అది తెలిసి కూడ చదువు, కెరీర్ అంటూ ఆమె ప్రేమని నిర్లక్ష్యం చేసి విదేశాలకు వెళ్లిపోయాను. తిరిగి వచ్చి ఆమెని నాదాన్ని చేసుకుందామనుకుంటున్న తరుణంలో ఆశ్రితకు పెళ్లయిపోయిందని తెలిసి హతాశుడినయ్యాను. ఆ దేవుడు కరుణామయుడు. ఆ దుర్మార్గుల బారి నుండి ఆమెను రక్షించాడు. ఆశ్రిత లేని జీవితం నాకు శూన్యమే అనుకున్న నన్ను దేవుడే ఇక్కడికి తీసుకొచ్చాడు. ఇక ఒక్కక్షణం కూడ ఆలస్యం చెయ్యాలని లేదు... దుర్గాదేవి సన్నిధిలో ఆశ్రితను నా అర్ధాంగిగా స్వీకరిస్తాను" దృఢ నిశ్చయంతో చెప్పాను.

నావైపు ప్రేమగా చూస్తున్న ఆశ్రిత కళ్లల్లో ఆనందం తొణికిసలాడింది.

**-అమిరపు విష్ణుప్రియ**
(సికింద్రాబాద్)

* * *

మూలా మూలలా గాలించి తీసేసిన చీరలు, పాంట్లు, షర్టులు పోగేస్తోంది కస్తూరి.

'ఏమైనా సరే, రేపీపాటికి అంతకన్నా పెద్ద వస్తువు తీసుకోకపోతే తన పేరు కస్తూరే కాదు' అనుకుంది దృఢంగా.

మధ్యాహ్నం జరిగిన సంఘటన మెదిలింది మళ్లీ ఆమె మనసులో. స్టీలు గిన్నెలవాడిని పిలిచింది ప్రక్క పోర్షన్ కమలామణి. అమ్మలక్కలు చుట్టూ మూగారు ఉత్సాహంగా. కిందా మీదా పెట్టి ఎలాగైతేనేం స్టీలు మర చెంబు తీసుకుందామె. పాత బట్టలకి గిన్నెలు తీసుకోడంలో ఆమెదే పైచేయి ఆ వీధిలో.

వాళ్లింట్లో సగం సామాను పాతబట్టలకి కొన్నవేనని తెలుసుకున్నప్పుడు ఆశ్చర్యంతో నోరెళ్లబెట్టింది కస్తూరి.

వాడటు వెళ్లగానే అందరూ చెంబుని తిప్పి తిప్పి చూశారు. ఆమెని తెగ పొగిడారు. "వంద రూపాయల పైమాటే, మొన్న మా అక్కగారమ్మాయి కొన్నది చదివింపులకని" అందొకావిడ తల తిప్పుతూ.

"అట్టే బట్టలు కూడా వెయ్యలేదు, ఎంత లాభమో?" అంది మరొకామె.


"ఏమైనా కమలగారికున్న చాకచక్యం మనకి రాదు లెండర్రా. ఆమెకామే సాటి.." తీర్మానించింది నిర్మలాదేవి.

అన్నీ వింటూ అమృతం పంచవచ్చిన మోహినీదేవిలా మరచెంబు అరచేతిలో పెట్టుకుని చిద్విలాసంగా నవ్వుతూ నిలబడింది కమలామణి. ఆమె మొహంలో ఎంత దర్పం! పాత బట్టలకి ఇలా గిన్నెలు తీసుకోవచ్చన్న ఆలోచనే లేదు తనకి! పాతబడగానే పనివాళ్లకో, ముష్టివాళ్లకో ఇస్తుండేది. ఎంత నష్టపోయింది ఇన్నాళ్లూ.

"అమ్మగారూ! పనైపోయిందండి" కొంగుకి చేతులు తుడుచుకుంటూ గుమ్మంలో నిలబడింది సీతాలు. "సర్లే" అంది కస్తూరి తలైనా తిప్పకుండా.

"పొద్దుగాల పాత సీర ఇస్తనన్నవ్ గదండి" గుర్తు చేసింది సీతాలు.

# పేదరికం కాటేసింది



ఉలిక్కిపడింది కస్తూరి. నిజమే, ఇస్తానంది. "దానికేం భాగ్యం సాయంత్రం పనికొచ్చినప్పుడు అడగవే తీసి వుంచుతాను" అందప్పుడు. ఇప్పుడెలా! అసలు చాలవని తనేడుస్తుంటే. "ఇద్దామనే అనుకున్నానే, ఏమీ లేవు. ఈసారెప్పుడైనా చూసి ఇస్తాలే. రాధాబాయిగారింట్లో కూడా చేస్తున్నట్లున్నావుగా, ఆమెనడక్కపోయావా?" ఉచిత సలహా ఇచ్చింది.

"నిన్ననే అడిగినానమ్మా. ముందడిగినా ఇచ్చుండే దాన్నే, ఉన్నయ్యన్నీ గిన్నెలకేశానే అందమ్మగారూ ఆయమ్మ."

అదీ సంగతి. అందరూ తెలివైనవాళ్లే. తనే దద్దమ్మ.

"గట్టి సీరే కావాల్నని లేదండి. చిరిగిన పేలికలైనా సరే నమ్మా, పిలగాని పక్కకి.." అభిమానం చంపుకుని అడిగింది మళ్లీ.చరున లేచింది కస్తూరి "ఉంటే నువ్విన్ని సార్లు అడగాలిటే, లేందే నేనేం చెయ్యనూ. ఇక వంటి మీద చీర విప్పి ఇవ్వాలి."

చిన్నబుచ్చుకుని వెనుదిరిగింది సీతాలు. కాళ్లీడ్చుకుంటూ ఖాళీ చేతులతో గుడిసెకొచ్చింది సీతాలు. గోనె సంచి మీద పడుకున్న పదిహేనురోజుల కొడుకు ఎలాగో చూస్తున్నాడు. పిలగాడిని ఒంటరిగా వదిలి తాగనీకి బోయినట్లుంది మగడు.

"ఏందిర కొడక అట్లున్నవేందిర!" కంగారుపడుతూ పక్క గుడిసె లచ్చమ్మని పిలుచుకొచ్చింది. అక్కడందరికీ ఆమె పెద్దదిక్కు. అనుభవం గలది.

పిల్లాడి వళ్లు చూసింది, అటూ ఇటూ తిప్పి చూసింది "ఏం రోగం లేదూ, పాడూ లేదూ. సలికెట్ల వడ వడ వణుకుతున్నాడే. మంచిగ గుడ్డలు గప్పాలె. మెత్తగ పక్కెయ్యాలె. ఒక్కపొర గుడ్డమీదేసి ఊదుకున్నావు. మంచిదానివే.." కోప్పడిందామె.

"ఏం జెయ్యనత్త. ఉన్న రెండు గుడ్డలు తడిపేస్తుండె..." నిస్సహాయంగా చూసింది. రాళ్లకి రప్పలకి మొక్కి మొక్కి పెళ్లయిన పన్నెండేళ్లకి తల్లి కాగలిగింది.

"ఈ యేడేమో సలి మోపైంది. ఎన్నడిట్టలేకుండ. జర మంచిగ గప్పు. ఈ నెలా పోతే ఆటెన్క ఎండలే నాయె" సలహా ఇచ్చి వెళ్లిపోయింది లచ్చమ్మ.

అన్నం వండబుద్ధి కాలేదు. దీపం వెలిగించలేదు. కొడుకుని వళ్లో పడుకోబెట్టుకుని దిగులుగా కూర్చుంది సీతాలు. తను పనిచేసే ఇళ్లల్లో అందరినీ డిగింది పాత చీర ఇయ్యమని. ఒక్క తల్లికి దయ రాకపాయె. ఆమె మనసు మంచుముద్దలా గడ్డకట్టుకుపోయింది. సీర ఇస్తనన్న కస్తూరెమ్మ కూడా లేవు పొమ్మంది. ఆమె కళ్లు దుఃఖంతో వర్షించసాగాయి. చీకటి చిక్కబడుతున్నకొద్దీ చలి ముదరసాగింది. నేలంతా చెమ్మ చెమ్మగా వుంది. పైన తాటాకుల సందుల్లోంచి మంచు కురవసాగింది. తడిసిన గుడ్డలు ఆరలేదు. పిల్లాడి వొణుకు అంతకంతకూ ఎక్కువౌతోంది. "ఈ ఒక్క రాత్రి గడిస్తే తల తాకట్టు పెట్టయినా సరే పాత గుడ్డలు అమ్మే కొట్లో కొనుక్కొస్తా..." నిశ్చయించుకుంది సీతాలు.

ఆమె నిశ్చయాలేవీ వాడికి వేడినివ్వలేదు. లేక లేక పుట్టినందుకు అపురూపంగా చూసుకుంటారనుకున్నదా ప్రాణి. తనింత బాధపడుతుంటే పట్టనట్లు కూర్చున్న తల్లిని చూసి కోపంతో బిగుసుకుపోయాడు వాడు, నీ తల నీ దగ్గరే వుంచుకో అని.

* * *

"ఇది విన్నారా పాపం, సీతాలు కొడుకు పోయాట్టండీ రాత్రి. అందుకే అది పొద్దున్న పనిలోకి రాలేదు" అంది సరోజ కస్తూరితో.

మోపెడు బట్టలేసి స్టీలు బేసిన్ తీసుకున్న ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న కస్తూరి "పిల్లల్ని పెంచడం వాళ్లకేం చేతనవుతుందండీ! పథ్యాలు చేస్తారా ఛస్తారా, దొరికినవన్నీ తినేసి..." అంటూ ఇంకా ఏదో చెబుతూనే వుంది.

**-జె.సరస్వతి**
(గుంటూరు)